క్లుప్తంగా

డీఆర్వోను కలిసిన ఏపీఎన్‌జీఓలు

కర్నూలు(సెంట్రల్) : కొత్తగా జిల్లాకు డీఆర్వోగా నియమితులైన కె.మధుసూదనరావును ఏపీ ఎన్‌జీఓలు కలిశారు. శనివారం ఆయనను ఆయన కార్యాలయంలో ఏపీఎన్‌జీఓ అధ్యక్షుడు వెంగళ రెడ్డి ఆధ్వర్యంలో పలువురు ఉద్యోగులు కలసి బొకే అందజేసి సన్మానించారు. ఉద్యోగుల సమస్యలపై సానుకూలంగా స్పందించాలని కోరారు.

విద్యుత్ ఫీడర్ ప్రారంభం

కర్నూలు (రాజ్‌విహార్) : నగరంలో విద్యుత్ సరఫరా అవసరాల కోసం 33 కేవీ విద్యుత్ ఫీడర్‌ను కర్నూలు ఆపరేషన్స్ ఎస్‌ఈ ఎం.ఉమాపతి శనివారం ప్రారంభించారు. అంతరాయ సమస్యలను నివారించేందుకు 220 కేవీ కార్బైడ్ ఫ్యాక్టరీ వద్ద ఉన్న సబ్‌స్టేషన్ బ్రేకర్‌కు అనుసంధానంగా దీనిని ఏర్పాటు చేసినట్లు ఎస్‌ఈ పేర్కొన్నారు. దీనివల్ల అంతరాయ సమస్యలు తగ్గుతాయని వెల్లడించారు. కార్యక్రమంలో ఈఈలు రమేష్, రాజేష్ పాల్గొన్నారు.

ర్యాగింగ్ జోలికి వెళ్లొద్దు

కర్నూలు (లీగల్) : ర్యాగింగ్ అనేది ఒక అసహ్యకరమైన సంఘటన. అది బాధితుడి మనసులో శాశ్వతమైన మచ్చను మిగుల్చుతుందని అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి పి.దివాకర్ అన్నారు. శనివారం జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజీలో ర్యాగింగ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ర్యాగింగ్ అనేది బాధితుడిని సంవత్సరాల తరబడి వెంటాడుతుందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ఏ ఒక్కరూ ర్యాగింగ్ జోలికి వెళ్లొదని సూచించారు. తర్వాత ర్యాగింగ్ దుష్ప్రభావాలు, శిక్షాపరమైన నిబంధనలు, శిక్షలు, జరిమానాల గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ మోహన్‌రెడ్డి, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వాణిజ్య సముదాయాల తనిఖీ

కర్నూలు (టౌన్) : నగరంలోని అలంకార్ ప్లాజా, యూకాన్ ప్లాజా, భూపాల్ కాంప్లెక్స్‌ల వద్ద చెత్త వ్యర్థాలు ఎక్కడ పడితే అక్కడ పడేయడంతో నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఆయన ఆ వాణిజ్య సముదాయాలను తనిఖీ చేశారు. ఎన్ని షాపులకు యూజర్ చార్జీలు వసూలు చేస్తున్నారు.. ఎంత మంది కడుతున్నారు.. ట్రేడ్ లైసెన్సులు ఉన్నాయా అని షాపుల వద్ద కమిషనర్ ఆరా తీశారు. వాణిజ్య షాపుల యజమానుల నుంచి సరైన సమాధానం రాకపోవడంతో షాపులను మూసి వేయించారు. ట్రేడ్ లైసెన్సులు, యూజర్ చార్జీలు కట్టిన తరువాతే షాపులు తెరవాలని ఆదేశాలు జారీ చేశారు. నగరపాలక ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, శానిటేషన్ సూపర్‌వైజర్ నాగరాజు, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు మునిస్వామి, షేక్షావలి, ముర్తుజావలిపాల్గొన్నారు.

'స్వచ్ఛత హి సేవా'లో భాగస్వామ్యం కావాలి

కర్నూలు (న్యూసిటీ) : 'స్వచ్ఛత హి సేవా' కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బాయినేని శ్రీనివాసులు విద్యార్థులకు పిలుపునిచ్చారు. శనివారం డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ విశ్వవిద్యాలయంలో ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో స్వచ్ఛత హి సేవా కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు, సిబ్బంది వర్సిటీ ప్రాంగణంలో ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్త, గడ్డిని తొలగించి శుభ్రం చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ జేఎండీ షఫీ, ఎన్‌ఎస్‌ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ వెంకటప్ప తదితరులు పాల్గొన్నారు.

వార్డు అడ్మినిస్ట్రేటివ్ కార్యదర్శుల బదిలీలు

కర్నూలు (టౌన్) : నగరపాలక పరిధిలోని వివిధ సచివాలయాల్లో పనిచేస్తున్న పలువురు అడ్మినిస్ట్రేటివ్ కార్యదర్శులు బదిలీ అయ్యారు. గడ్డ వీధిలో పనిచేసే వార్డు అడ్మినిస్ట్రేటివ్ కార్యదర్శి కప్పల్‌నగర్‌కు అక్కడ పనిచేసే కురువ మౌనికను గడ్డ వీధికి, వెంకటరమణ కాలనీలో పనిచేసే రాధికా రెడ్డిని మమతానగర్‌కు, మొఘల్‌పురాకు చెందిన సి. వెంకటేశ్వర్లును షరాఫ్‌బజార్‌కు బదిలీ చేశారు. అలాగే మొఘల్‌పురా సచివాలయంలో వార్డు వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్యదర్శిగా పని చేసే పవన్‌కుమార్‌ను వార్డు అడ్మినిస్ట్రేటివ్ కార్యదర్శిగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు శనివారం నగరపాలక అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్ ఉత్తర్వులు జారీ చేశారు. పరిపాలన పరంగా ఇబ్బందులు రాకుండా బదిలీలు చేసినట్లు తెలిపారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి

కర్నూలు(సెంట్రల్) : జిల్లాలో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన అధికారులను ఆదేశించారు. శనివారం ఆమె మండల ప్రత్యేకాధికారులు, ఎంపీడీఓలు, తహసీల్దార్లు, ఇతర అధికారులతో రీసర్వే, హౌసింగ్, ఉపాధి, ప్రభుత్వ ప్రాధాన్యత భవన నిర్మాణాలపై టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..భూ హక్కు పత్రాల పంపిణీకి సంబంధించి ఓర్వకల్ మండలంలోని లొద్దిపల్లి, గూడూరు మండలంలోని జూలకల్లు, సి.బెళగల్, కర్నూలు రూరల్ మండలంలో ఎక్కువ శాతం పెండింగ్‌లో ఉన్నాయని, సోమవారం సాయంత్రం లోపు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇళ్ల నిర్మాణాలను వేగవంతానికి ఎంపీడీఓలు, ఇతర అధికారులు సమీపంలోని జగనన్న కాలనీలను సందర్శించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. జేసీ నారపురెడ్డి మాట్లాడుతూ..రీసర్వే చేయడానికి రైతులతో 9(2)లో సంతకం పెట్టించుకోవాలని, వారి నుంచి ఏమైనా అభ్యంతరాలు ఉంటే 10(2) నోటీసు స్వీకరించాలని సూచించారు.



జిల్లా కోర్టు సమీపంలో ఆకట్టుకుంటున్న గణపతి



గాలి గేరిలో..



వడ్డేగేరిలో



మాలగేరిలో



చిత్తారివీధి శివగాలి వీరాంజనేయస్వామి ఆలయం వద్ద..



ఎస్.నాగప్ప వీధిలో భారీ గణనాథుడు

జయములివ్వు గణేశా!

కర్నూలు కల్చరల్: వినాయక నవరాత్రి మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. నగరంలో ఆరో రోజు శనివారం వినాయకుని ఆలయాలతో పాటు గణనాథుని మండపాల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. జయములివ్వు గణేశా అంటూ గణపతి హోమాలు, అర్చనలు, సామూహిక కుంకుమార్చనలు, విష్ణు, లలితా సహస్ర పారాయణాలు చేశారు. భజనలు, ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పిల్లలు, మహిళలకు వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించారు. కర్నూలు నగర పాలక సంస్థ వద్ద ఏర్పాటు చేసిన పూజల్లో నగర మేయర్ బీవై రామయ్య, కమిషనర్ భార్గవ తేజ, 8, 43వ వార్డుల్లో ని వినాయక మండపాల వద్ద వినాయకునికి నిర్వహించిన పూజల్లో కేడీసీసీబీ చైర్‌పర్సన్ ఎస్వీ విజయ మనోహరి, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి పాల్గొన్నారు. గణేష్ మహోత్సవ కేంద్ర సమితి ప్రతినిధులు వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాలను సందర్శించి పూజల్లో పాల్గొన్నారు.



దండెగేరిలో



43వ వార్డులో వినాయక మండపం వద్ద కేడీసీసీబీ చైర్‌పర్సన్ విజయమనోహరి, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి, కమిటీ సభ్యులు

వరుణ దేవుడు కరుణించాలని..

కర్నూలు కల్చరల్: జిల్లాలో ప్రస్తుతం నెలకొన్న వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని శ్రీగణేష్ మహోత్సవ కేంద్ర సమితి ఆధ్వర్యంలో వినాయక్ ఘాట్‌లో భక్తి శ్రద్ధలతో వరుణయాగం నిర్వహించారు. పండితులు రాజేశ్ శర్మ, ఫణీంద్ర శర్మ, మురళీ కృష్ణ శర్మ, గజానన్ దేశ్ పాండే, సంతోష్ శశర్మలు యాగం చేశారు. కార్పొరేటర్ సత్య నారాయణమ్మ, సమితి జిల్లా సంఘటనా కార్యదర్శి డాక్టర్ నాగఫణి శాస్త్రి, జిల్లా కార్యాధ్యక్షుడు సందడి సుధాకర్, నగర అధ్యక్షుడు డాక్టర్ మోక్షేశ్వరుడు, నగర ఉపాధ్యక్షుడు కగ్గోలు హరీష్‌బాబు, నగర కార్యదర్శి కాశీవిశ్వనాథ్, సభ్యులు ఈ యాగంలో పాల్గొన్నారు.



వరుణయాగం నిర్వహిస్తున్న పండితులు, సమితి ప్రతినిధులు

ఫిర్యాదులపై ఆర్జేడీ విచారణ

కర్నూలు సిటీ: ఇటీవల జరిగిన పదోన్నతులు, బదిలీలపై హొళగుంద మండలంలోని మార్లమడికి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల సెకెండ్ గ్రేడ్ టీచర్ తెనే సాయిబాబా చేసిన ఫిర్యాదుపై ఆర్జేడీ వెంకట కృష్ణారెడ్డి శనివారం డీఈఓ ఆఫీస్‌లో విచారణ చేపట్టారు. విద్యాశాఖ జారీ చేసిన నిబంధనల ప్రకారం చార్జెస్ పెండింగ్‌లో ఉన్న వారు పదోన్నతులు, బదిలీకి అర్హులు కాదన్నారు. మరి దీనికి విరుద్ధంగా చార్జెస్ పెండింగ్‌లో ఉన్న వారికి ఎందుకు పదోన్నతులు ఇచ్చారు, బదిలీలు చేశారంటూ ముగ్గురిపై పాఠశాల కమిషనర్‌కు సాయిబాబు ఫిర్యాదు చేసి, హైకోర్టులో కేసు వేశారు. దీనిపై కమిషనర్ సురేష్ కుమార్ సైతం ఈ నెల మొదటి వారంలో విజయవాడలో విచారణ చేశారు. ఈ అంశంపై పూర్తి స్థాయిలో విచారణ చేయాలని పాఠశాల విద్య ప్రాంతీయ కార్యాలయ అధికారి వెంకట కృష్ణారెడ్డిని ఆదేశించారు. ఆ మేరకు శనివారం ఆర్జేడీ విచారణ చేపట్టారు. ప్రస్తుతం ఉల్చాల హైస్కూల్‌లో బయాలాజికల్ సైన్స్ టీచర్‌గా పని చేస్తున్న కె.విజయభాస్కర్ యాదవ్‌పై అనేక ఫిర్యాదులు ఉన్నాయని సాయిబాబా తెలిపిన మేరకు సదరు టీచర్‌కు సంబంధించిన సర్వీసు రిజిస్టర్‌పై విచారణ చేశారు. ఈ విచారణలో డీఈఓ డా.వి రంగారెడ్డి, ఏడీ శ్యామూల్‌పాల్, కర్నూలు డిప్యూటీ డీఈఓ హనుమంతరావు, సూపరింటెండెంట్లు రాజశేఖర్‌లతో పాటు, ఫిర్యాదిదారుడు సాయిబాబా పాల్గొన్నారు.

బాధిత రైతులకు పరిహారం చెల్లిస్తాం

కర్నూలు (న్యూటౌన్): చెన్నై- సూరత్ నేషనల్ హైవేలో భూములు కోల్పోయిన రైతులందరికీ రెవెన్యూ రికార్డులు పరిశీలించి నష్టపరిహారం చెల్లిస్తామని కర్నూలు ఆర్డీఓ సి హరిప్రసాద్ అన్నారు. శనివారం కర్నూలు మండలం ఉల్చాల గ్రామంలో చెన్నై-సూరత్ నేషనల్ హైవేలో భూములు కోల్పోయిన రైతులతో గ్రామసభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చెన్నై-సూరత్ నేషనల్ హైవేలో దాదాపు 180 ఎకరాలకు సంబంధించి 98 మంది రైతుల భూములు ఉన్నాయన్నారు. ఇప్పటికే ప్రభుత్వం 60 మంది రైతులకు నష్టపరిహారం చెల్లించిందన్నారు. ఇంకా 120 మంది రైతులకు సంబంధించిన భూములను రెవెన్యూ రికార్డులను పరిశీలించి, ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపి నష్టపరిహారం చెల్లించేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. రైతులు ఎవరూ అధైర్య పడొద్దని ఆర్ఓఆర్, ఆర్ఎస్ఆర్ ప్రకారం భూములు కోల్పోయిన వారందరికీ పరిహారం వస్తుందని చెప్పారు. కర్నూలు రూరల్ తహసీల్దార్ శివరాముడు, వీఆర్ఓలు ఆంజనేయులు, నాయుడు, రైతులు పాల్గొన్నారు.

పర్యాటక ప్రాంతాలను సందర్శించాలి

- జిల్లా పర్యాటక సాంస్కృతిక శాఖ అధికారి పి.విజయ

కర్నూలు కల్చరల్: పర్యాటక ప్రాంతాలను సందర్శించి అక్కడి విశేషాలను తెలుసుకోవాలని జిల్లా పర్యాటక సాంస్కృతిక శాఖ అధికారి పి.విజయ అన్నారు. ఈనెల 27వ తేదీ ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని కేవీఆర్ కళాశాల యువ టూరిజం క్లబ్ సభ్యులు శనివారం ప్రసిద్ధ పర్యాటక కేంద్రం కొండారెడ్డి బురుజును సందర్శించారు. అక్కడ పరిశుభ్రత పచ్చదనం కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులతో ట్రావెల్ ఫర్ లైఫ్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా విజయ మాట్లాడుతూ పర్యాటక వనరులను బుద్ధి పూర్వకంగా ఉపయోగించుకోవాలన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలన్నారు. భవిష్యత్తు తరాలకు స్థానిక, సంస్కృతి, వారసత్వాన్ని పరిరక్షించడానికి, గౌరవించడానికి కట్టుబడి ఉండాలన్నారు. వన్యప్రాణుల సంరక్షణలో భాగ స్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో కేవీఆర్ కళాశాల అధ్యాపకురాలు విజయలక్ష్మి, యువ టూరిజం క్లబ్ సభ్యులు సుమారు 300 మంది పాల్గొన్నారు.



పరిశుభ్రత పచ్చదనం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న యువ టూరిజం క్లబ్ సభ్యులు

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోండి



సైగల భాష క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న రయిస్ ఫాతిమా, ఇతరులు

కర్నూలు(అర్బన్): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు రయిస్‌ఫాతిమా కోరారు. శనివారం స్థానిక సీ క్యాంప్‌లోని ప్రభుత్వ దివ్యాంగుల బాలుర వసతి గృహంలో అంతర్జాతీయ బధిరుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా వందల సంఖ్యలో హాజరైన బధిరుల సమక్షంలో కేక్ కట్ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రయిస్ ఫాతిమా మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతుల కోసం పాలక ప్రభుత్వాలు అనేక పథకాలను ప్రవేశ పెట్టడంతో పాటు వారికి అవసరమైన పరికరాలను అందించడం జరుగుతుందన్నారు. అనంతరం 2023 సంవత్సరానికి సైగల భాష క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కేడీఏడీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి. వినోద్, ఎస్. సుబుల్‌బాషా, కేడీఎస్‌ఈడీ ప్రధాన కార్యదర్శి సాధిక్‌బాషా, ఏపీఏడీ వైస్ చైర్మన్ యం. వాసుదేవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్మిక రాజ్య స్థాపనే లక్ష్యం

కర్నూలు(సెంట్రల్): కార్మిక రాజ్య స్థాపనే లక్ష్యంగా సీఐటీయూ పనిచేస్తుందని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంఏ గఫూర్ అన్నారు. శనివారం కార్మిక, కర్షక భవన్‌లో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్ రాధాకృష్ణ అధ్యక్షతన సీఐటీయూ జిల్లా నిర్మాణ వర్క్‌షాపు జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ..దోపిడీ లేనిసమజాన్ని ఏర్పాటు చేసుకోవడం కోసం సీఐటీయూ ఆవిర్భావించిందన్నారు. నేడు ఉద్యోగులు, కార్మికులు ఎన్నో సమస్యలతో అల్లాడిపోతున్నా ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. పాలకులు కార్మికులను కట్టు బానిసలుగా మార్చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బి.రామాంజనేయులు, ఎండీ అంజిబాబు, పి.నిర్మల, ఈరన్న, సాయిబాబా, కె.ప్రభాకర్, జే.నాగేశ్వరరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఏ గఫూర్

సంక్షిప్త సమాచారం

బీజేపీ ఎంపీపై చర్యలు తీసుకోవాలి

కర్నూలు(సెంట్రల్) : ముస్లింలపై విద్వేషపూరిత వ్యాఖ్యలు చేసిన బీజేపీ ఎంపీ రమేష్ బిదూరిపై కఠిన చర్యలు తీసుకోవాలని అవాజ్ నగరకమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పి.ఇక్బాల్ హుస్సేన్, షేక్ మహ్మద్ షరీఫ్ శనివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. వెంటనే ఆయన లోక్ సభ సభ్యత్వాన్ని రద్దు చేయాలన్నారు.

సీపీఎస్ అమలు చేయాలి

కర్నూలు(సెంట్రల్): సీపీఎస్‌ను అమలు చేయాలని ఫ్యాప్టో రాష్ట్ర చైర్మన్ కె.ప్రకాష్‌రావు డిమాండ్ చేశారు. శనివారం ఫ్యాప్టో, సీపీఎస్ ఉద్యోగులు కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గ్యారంటీ పెన్షన్ స్కీంను ఎట్టి పరిస్థితుల్లోనూ ఒప్పుకోమన్నారు. సీపీఎస్ ద్వారా ఉద్యోగులకు మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు జి.హృదయరాజు, గోకారి, తిమ్మప్ప, రాంభూపాల్ రెడ్డి, సీపీఎస్ ఉద్యోగులు లింగారెడ్డి పాల్గొన్నారు.

జీఓలు 21,31లను రద్దు చేయాలి



ధర్నా చేస్తున్న ఆటో వర్కర్లు, నాయకులు

కర్నూలు(సెంట్రల్) : ఆటో కార్మికులకు శాపంగా మారిన జీఓలు 21, 31లను వెంటనే రద్దుచేయాలని ఏఐటీయూసీ నగర అధ్యక్ష, కార్యదర్శులు బి.వెంకటేష్, జి.చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. శనివారం ఏపీ ఆటో వర్కర్స్ అండ్ డ్రైవర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కృష్ణారెడ్డి అధ్యక్షతన కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను జీఎస్టీ పరిధిలోకి తీసుకు రావాలన్నారు. ఆటో కార్మికుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాట చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రామాంజనేయులు, జయరాంరెడ్డి, స్వాములు, వెంకటేష్, రాజు పాల్గొన్నారు.

చెత్త తరలింపు వాహనాల నిలుపుదల

కర్నూలు (టౌన్): నగరంలో ఇంటింటి నుంచి చెత్తను సేకరించేందుకు ఏజెన్సీ ద్వారా నియమించిన ఆటోలను కొన్ని అనివార్య కారణాలతో నిలుపుదల చేసినట్లు నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రత్యామ్నాయంగా పారిశుద్ధ్యంకు సంబంధించి ఎటువంటి సమస్యలు తలెత్తకుండా కార్మికులతో ఇంటింటి చెత్త సేకరణ చేయిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు గమనించి చెత్తను బయట పారేయకుండా ఇంటి వద్దకు వచ్చే తమ కార్మికులకు అందజేయాలని సూచించారు.

రక్తదానం చేసి ప్రాణదాతలు కండి

కల్లూరు: రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని భారతీయ జనతా పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షురాలు బైరెడ్డి శబరి అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని శనివారం స్థానిక చెన్నమ్మ సర్కిల్‌లో రెడ్ క్రాస్ సహకారంతో మెగా రక్తదాన శిబిరం, మోదీ ఫొటో ఎగ్జిబిషన్ స్టాల్ నిర్వహించారు.

నేడు 'పక్కింటి మొగుడు'నాటక ప్రదర్శన

కర్నూలు కల్చరల్: నెల నెలా సాంఘిక నాటకంలో భాగంగా టీజీవీ కళాక్షేత్రంలో ఆదివారం సాయంత్రం 6.30 గంటలకు 'పక్కింటి మొగుడు' సాంఘిక నాటక ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు కళాక్షేత్రం అధ్యక్ష కార్యదర్శులు పత్తి ఓబులయ్య, మహమ్మద్ మియ్యా తెలిపారు. పండు క్రియేషన్స్ కొప్పోలు వారి ఈ నాటకాన్ని గోవింద రాజుల నాగేశ్వరరావు రచించగా బాలినేని నాగేశ్వరరావు దర్శకత్వం వహించనున్నారు. కళాభిమానులందరూ హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

స్కానింగ్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలి

కర్నూలు(హాస్పిటల్): అక్రమంగా కొనసాగుతున్న స్కానింగ్ సెంటర్లు, డయాగ్నోస్టిక్ సెంటర్లపై చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్ఓ డాక్టర్ బి. రామగిడ్డయ్యకు డీవైఎఫ్ఐ నాయకులు శనివారం వినతి పత్రం సమర్పించారు. జిల్లా కార్యదర్శి నగేష్, జిల్లా సహాయ కార్యదర్శి హుసేన్‌బాషా మాట్లాడుతూ స్కానింగ్ సెంటర్లలో బోర్డులో ఉన్న ధరలకు సంబంధం లేకుండా ఇష్టారీతిన గర్భిణిల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. కొన్నిచోట్ల లింగనిర్ధారణ పరీక్షలు చేస్తున్నారని, దాని ఆధారంగా భ్రూణహత్యలు జరుగుతున్నాయని విమర్శించారు.

గణిత మేధావి నాగేళ్ల ఏలియా



నాగేళ్ల ఏలియా చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

కర్నూలు కల్చరల్: గణితాన్ని సులభతరం చేసిన మేధావి గణిత శతావధాని నాగేళ్ల ఏలియా అని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. శనివారం ఎస్వీ కాంప్లెక్స్‌లోని కర్నూలు కళాకారుల సేవా కేంద్రంలో నాగేళ్ల ఏలియా వర్ధంతి కార్యక్రమం జరిగింది. విశ్రాంత తహసీల్దార్లు సయ్యద్ రోషన్ అలీ, అజయ్‌కుమార్, కర్నూలు కళాకారుల సేవా కేంద్రం అధ్యక్షుడు బైలుప్పల షఫిఉల్లా, విశ్రాంత ఏపీఎస్ ఆర్టీసీ మేనేజర్ ప్రసాద్‌రావు, బీఎస్ఎన్ఎల్ విశ్రాంత టెక్నికల్ మేనేజర్ పులికొండలు ఏలియా చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఐదేళ్ల పాపకు అరుదైన మూర్ఛవ్యాధి

- కిమ్స్‌లో ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా చికిత్స



పాప ప్రణీకతో వైద్యురాలు డాక్టర్ ఆర్.శ్వేత

కర్నూలు(హాస్పిటల్): అరుదైన మూర్ఛవ్యాధితో బాధపడుతున్న ఐదేళ్ల బాలికకు నగరంలోని కిమ్స్ హాస్పిటల్ వైద్యులు ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా వైద్య చికిత్స అందించి ప్రాణం పోశారు. వివరాలు కిమ్స్ హాస్పిటల్ పీడియాట్రిక్ న్యూరాలజిస్టు డాక్టర్ శ్వేత రాంపల్లి మాటల్లోనే...'బనగానపల్లికి చెందిన వ్యవసాయదారులు కె. వెంకటరాముడు, ఎం. వెంకటేశ్వరమ్మ దంపతుల కుమార్తె ప్రణీకకు పదే పదే మూర్ఛ వస్తుండటంతో ఆమె తల్లిదండ్రులు మా ఆసుపత్రికి తీసుకొచ్చారు. అదే సమయంలో ఆమెకు ముఖం ఒకవైపు తిరిగిపోతూ కళ్లు పదే పదే ఆర్పుతూ కాసేపు ఏమీ చేయకుండా అలా ఉండిపోతోందని కూడా వారు చెప్పారు. దాంతో పాపకు మేము మూడు గంటల పాటు సవివరంగా వీడియో ఈఈటీ పరీక్ష చేసి విభిన్నమైన మూర్ఛ వచ్చిందని గుర్తించాము. ఈ తరహా మూర్ఛ కేవలం మెదడులోనే వస్తుంది తప్ప బయటకు కనిపించదు. ఈ పాపకు అవి రోజుకు ఏకంగా 80 నుంచి 100 సార్లు వచ్చాయి. తర్వాత పాపను రెండు వారాల పాటు ఆసుపత్రిలో ఉంచుకుని చికిత్స అందించాము. చికిత్స చేస్తున్నప్పుడు కూడా ఆ పాపకు రెండు సార్లు తీవ్ర స్థాయిలో మూర్ఛ వచ్చినా వెంటనే మందుల సహాయంతో ఆపగలిగాము. ప్రణీకకు ఒక అరుదైన జనరలైజ్డ్ ఎపిలెప్సి సింద్రోమ్ అనే మూర్ఛ వ్యాధి ఉన్నట్లు తేల్చి నాలుగు రకాల మందులు, డైట్ థెరపీ మీద డిశ్చార్జ్ చేశాము' అని ఆమె వివరించారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి



రగ్బీ ఎంపిక పోటీలను ప్రారంభిస్తున్న ఒలింపిక్ సంఘం చైర్మన్ షేక్ మహబూబ్‌బాషా

కర్నూలు (టౌన్) : విద్యార్థినీ విద్యార్థులు క్రీడల్లో రాణించాలని ఒలింపిక్ సంఘం చైర్మన్ షేక్ మహబూబ్ బాషా అన్నారు. శనివారం స్థానిక బి.క్యాంపు క్రీడా మైదానంలో జిల్లా స్థాయి రగ్బీ ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్రీడల్లో రాణిస్తే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. బి. క్యాంపునకు చెందిన టెన్నిస్ క్రీడాకారిణి జఫ్రీన్ ప్రస్తుతం డిప్యూటీ కలెక్టర్ ఉద్యోగం సంపాదించిందన్నారు. క్రీడలకు తన వంతుగా సహకారం అందిస్తానన్నారు. రగ్బీ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు రామాంజనేయులు, గుడిపల్లె సురేందర్ మాట్లాడుతూ ఎంపికయిన క్రీడాకారులు వచ్చే నెల 1, 2 తేదీల్లో కర్నూలు నగరంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి రగ్బీ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమంలో క్రీడా సంఘాల ప్రతినిధులు శ్రీనివాసులు నాగరత్నమయ్య, చిట్టిబాబు, వ్యాయమా ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అసెంబ్లీలో టీడీపీ నేతల తీరు సరికాదు

- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుభాష్ చంద్రబోస్



మాట్లాడుతున్న సుభాష్ చంద్రబోస్.

కర్నూలు(రాజ్‌విహార్): పవిత్రమైన అసెంబ్లీలో తెలుగుదేశం ఎమ్మెల్యేలు వెకిలి చేష్టలు చేయడం సరి కాదని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్దూరు సుభాష్ చంద్రబోస్ అన్నారు. శనివారం స్థానిక ప్రైవేటు హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు నాయుడు అధికారాన్ని అడ్డుపెట్టుకొని అవినీతికి పాల్పడ్డారన్నారు. ఈ అంశంపై ఆ పార్టీ నేతలు అసెంబ్లీలో రచ్చ చేయడం తగదన్నారు. ముఖ్యంగా బాలకృష్ణ ప్రవర్తన సిగ్గుచేటని, మీసం తిప్పడం, తొడలు కొట్టడం, విజిల్ వేయడం ఏమిటని ప్రశ్నించారు. గతంలో ఇద్దరిని కాల్చిన కేసులో శిక్ష నుంచి తప్పించుకునేందుకు మెంటల్ సర్టిఫికెట్ తెచ్చుకున్నారని, ఇప్పుడు అదే సర్టిఫికెట్‌ను అడ్డు పెట్టుకొని ఎవరిని కాల్చినా ఆశ్చర్యపోవాల్సిన పనిలేదన్నారు. ఆయనను పూర్తి పదవీ కాలం సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు బాబు, లోకేష్, పవన్‌ను చిత్తుగా ఓడిస్తారని చెప్పారు. అనంతరం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ బీసీ విభాగం రాష్ట్ర కార్యదర్శి ధనుంజయ ఆచారి, నాయకులు రాజశేఖర్, లక్ష్మీకాంతయ్య మాట్లాడుతూ అసెంబ్లీతో దురుసుగా వ్యవహరించిన బాలకృష్ణపై చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో నాయకులు ధన విజేయుడు, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం

కర్నూలు కల్చరల్: కర్నూలు స్పిరిచ్యువల్ సొసైటీ ఆధ్వర్యంలో కర్నూలు బుద్ధా పిరమిడ్ ధ్యాన కేంద్రంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న 'ధ్యానం – ఆత్మ జ్ఞాన బోధ' కార్యక్రమం శనివారం ముగిసింది. భీమవరానికి చెందిన బ్రహ్మ విధ్వరిష్ఠ తటవర్తి రాజ్యలక్ష్మి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పారిశ్రామిక వేత్త బ్రహ్మరిషి బి.వి.రెడ్డి హాజరై మాట్లాడుతూ ధ్యానం చేయడం వల్ల సంపూర్ణ ఆర్యోగం సిద్ధిస్తుందన్నారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక ప్రాంతాలకు చెందిన పిరమిడ్ ధ్యానులు, కేంద్రం సభ్యులు గుణాకర్‌రెడ్డి, రామ్మోహన్, తిరుపతి రెడ్డి, పెద్దయ్య, రాజు, ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.